క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆదోని అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లకు, నర్సులకు, సెక్యూరిటీ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపకాధికారి యేసురత్నం ఆధ్వర్యంలో మహిళలు వంటగదిలో గ్యాస్, ఆయిల్ ఫైర్ జరగడానికి గల కారణాలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకైనప్పుడు చేపట్టాల్సిన చర్యలు తదితర వాటిని వివరించారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు వెంకటేశ్వర్లు, మహబూబ్‌బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

ఆదోని రూరల్ : భీమా ఇంజినీరింగ్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఎంసెట్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల సెక్రటరీ పి.విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక నేషనల్ స్కూల్‌లో బుధవారం ఉదయం 9:30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వివరాలకు సెల్:7660011182,7660011144 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

23న మంగరాయుడికి ప్రత్యేక పూజలు

ఆదోని అర్బన్:పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామికి అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం మంగరాయుడికి విశేష గంధలేపనం కార్యక్రమం చేపడతామని ఆలయ మేనేజర్ వాసుదేవ రావు బుధవారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల ఆదేశాల మేరకు ఆరోజున స్వామివారికి మధు అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష గంధ లేపనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని,ఇందుకు 08512252505, 9110767866 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు

ఆదోని టౌన్ : పట్టణం నడిబొడ్డున జేబీ కాంప్లెక్స్ వద్ద ఖాళీ స్థలం, మురుగు కాల్వలను మున్సిపల్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. పూడికతో నిండి పోయిన మురుగు కాలువ, అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి పనులను పరిశీలించారు.ఖాళీ స్థలంలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్థలానికి కంచె వేయించాలని, లేదా ఏదైనా నిర్మాణం చేపట్టాలని స్థల యజమానికి సూచించారు.

డార్విన్‌కు నివాళి



దుద్దిలో డార్విన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి: నేటి సమాజ పరిస్థితుల్లో చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మూఢ నమ్మకాలను వీడాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు శంకరయ్య కోరారు. బుధవారం కోసిగి మండలంలోని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చార్లెస్ డార్విన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందిన కాలంలో కూడా గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలు వీడడం లేదన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నవీన్ కుమార్ రెడ్డి, నాగలింగమయ్య, కళావతి, జగదీప్, సౌజన్య, కౌసర్, మైథిలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు,సరస్వతిపూజ కార్యక్రమాన్ని హెచ్‌ఎం బసప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.హెచ్‌ఎం సీనియర్ ఉపాధ్యాయులు నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు భువనేశ్వరి, పద్మావతి, నేత్రావతి, పీఎంసీ చైర్మన్ కిషోర్, విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత



గిరిప్రసాద్

ఆదోని అర్బన్ : పట్టణానికి చెందిన గిరిప్రసాద్ యూజీసీ నెట్‌కు అర్హత సాధించాడు. ఆయన స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. డిసెంబర్‌లో జరిగిన పరీక్షల్లో పాల్గొనగా మూడు రోజుల క్రితం వెలువడి ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణుడై జేఆర్‌ఎఫ్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత సాధించాడు. దీంతో ఆయనను తల్లిదండ్రులు, స్నేహితులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు అ'భద్ర'త

- అప్పర్ భద్ర డ్యామ్ నిర్మాణంతో సీఎం జలాలకు ఎసరు
- 29.90 టీఎంసీల సామర్థ్యంతో ఎగువన ప్రాజెక్టు నిర్మాణం
- టీబీపీ, ఆర్డీఎస్, సుంకేసుల, శ్రీశైలం ప్రాజెక్టులపై ప్రభావం
- పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ప్రాజెక్టుల పరిస్థితి అంతే..
- ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ కాలువ వాటాలపైనా..

వరద జలాల ఆధారంగా కర్ణాటక ప్రభుత్వం ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది. ఈ నిర్మాణం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలు పూర్తిగా నష్టపోయే ప్రమాదముంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలు ఎడారిగా మారే అవకాశముందని ఆందోళన నెలకొంది. దిగువ ప్రాంతాల రైతాంగాన్ని బలిపెట్టేలా కేంద్ర ప్రభుత్వం నిర్మాణానికి అనుమతులివ్వడం సరికాదని అన్నదాతలు పేర్కొంటున్నారు. నిర్మాణం పూర్తయితే ఆర్డీఎస్ ఆనకట్ట, సుంకేసుల, శ్రీశైలం ప్రాజెక్టుపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారనుంది. అలాగే..ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ కాలువల వాటాలకు గండిపడే అవకాశముంది.



తుంగభద్రపై నిర్మించిన హొస్పేట్ డ్యాం



సుంకేసుల ప్రాజెక్టు



ఆర్డీఎస్ ఆనకట్ట



కర్ణాటకలోని అప్పర్ డ్యామ్ కెనాల్

మంత్రాలయం : వరద జలాలను తన్నుకు పోయేందుకు కర్ణాటక సిద్ధమైంది. బచావత్, బ్రిజేష్‌కుమార్ కమిటీల నియమాలను తుంగలో తొక్కి సరికొత్త ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కేంద్ర జల సంఘం, కేంద్ర జలశక్తి శాఖ అనుమతులతో అప్పర్ (ఎగువ) భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణంతో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, సుంకేసుల డ్యామ్, శ్రీశైలం ప్రాజెక్టులపై వరద జలాల ప్రభావం పడనుంది. ఈ నిర్మాణంతో మునుముందు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల జగడాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆంధ్ర, తెలంగాణకు అన్యాయం జరగనుంది. ఎగువ ప్రాజెక్టు నిర్మాణంతో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉంది.

గతంలో ప్రాజెక్టుల నిర్మాణం ఇలా..

తుంగభద్ర నదిపై 101 టీఎంసీల సామర్థ్యంతో హొస్పేట్ డ్యామ్, 1.25 టీఎంసీలతో సుంకేసుల డ్యామ్, 216 టీఎంసీల సామర్థ్యంతో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించారు. అందులో శ్రీశైలం, హొస్పేట్ డ్యాములు మల్టీపర్పస్ విధానంలో నిర్వహణ సాగుతోంది. హొస్పేట్ డ్యామ్ నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాలువాల ద్వారా అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలకు సాగు నీరు సరఫరా చేస్తున్నారు. హెచ్ఎల్‌సీకి 32.5 టీఎంసీలు, ఎల్ఎల్‌సీకి 24 టీఎంసీలు, ఆర్డీస్ ఎడమ గట్టు కాలువకు 17.1 టీఎంసీల నీటిని కేటాయించారు. హెచ్ఎల్‌సీ కింద 1.90 లక్షల ఎకరాలు, ఎల్ఎల్‌సీ ద్వారా 1.57 లక్షల ఎకరాలు, ఆర్డీస్ ఎడమగట్టు కాలువ కింద 87 వేల ఎకరాలు, సుంకేశుల డ్యామ్ పరిధిలోని కేసీ కెనాల్ ద్వారా 1.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, కేసీ కెనాల్ కింద ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ఈ కాలువల కింద సాగు గగనమే. అయితే ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం అప్పర్ భద్ర డ్యామ్‌కు అనుమతులు ఇవ్వడం శోచనీయం. భద్ర నదిపై జాతీయ హోదా కల్పిస్తూ రూ.12,500 కోట్లతో ప్రాజెక్టు నిర్మించనున్నారు. 29.90 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించి అందులోకి అప్పర్ తుంగ నది నుంచి 17.40 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. ప్రాజెక్టు పరిధిలో దాదాపు 2.25 లక్షల ఎకరాలకు సాగు నీరు సరఫరా చేయనున్నట్లు సమాచారం. ప్రాజెక్టు పూర్తయితే వరద జలాల శాతం తగ్గిపోనుంది. దీంతో హొస్పేట్, సుంకేసుల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద జలాల ప్రభావం పడనుంది. ముఖ్య వరద జలాలపై ఆధారపడి నిర్మించిన పులికనుమ, ఆర్డీఎస్ కాలువలు, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా పథకాల నిర్వహణ అగమ్యగోచరమే.

జల జగడాలకు ఆజ్యం..

ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాల అభిప్రాయాలు తీసుకోకుండా కర్ణాటక ప్రభుత్వం అప్పర్ భద్ర డ్యామ్ నిర్మాణానికి పూనుకోవడం విచారకరం. భవిష్యత్‌లో ఇరు రాష్ట్రాల మధ్య జల జగడాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్డీస్ స్లూయిస్ గేట్ల మూత, ఆనకట్ట ఎత్తుపెంపు విషయంలో వివాదం కొనసాగుతోంది. ఆంధ్రకు అన్యాయం చేస్తూ రాజోలి బండ డైవర్షన్ స్కీమ్‌కు 17.1 టీఎంసీలు కేటాయించి కుడి గట్టు కాలువకు కేవలం 4 టీఎంసీలు మాత్రమే కేటాయించారు. క్రితం ప్రభుత్వాలు కుడి గట్టు కాలువ నిర్మాణం చేపట్టక పోవడంతో రైతులకు అన్యాయం జరిగింది. ఆర్డీఎస్ ఆనకట్ట 5 స్లూయిస్ గేట్లను మూసివేయడంతో సుంకేసులకు వరద నీటి శాతం తగ్గింది. అనాదిగా ఆంధ్రకు అన్యాయం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగువ రైతుల కష్టాలను వదిలేసి మరోమారు కేంద్రం అప్పర్ భద్ర డ్యామ్ నిర్మించి మరింత కష్టాల్లోకి నెట్టింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అన్యాయం



కర్ణాటక ప్రభుత్వం కొత్త డ్యామ్ నిర్మిస్తే దిగువ రైతులకు అన్యాయం జరుగుతుంది. నది పొడవున్న ఎత్తిపోతల పథకాల నిర్వహణ కష్టమవుతుంది. ఇప్పటికే తుంగభద్ర దిగువ కాలువకు నీటి సరఫరా సరిగా లేదు. కర్ణాటక ప్రాంతాల్లో జల చౌర్యాలు ఎక్కువగా ఉండడంతో వాటా నీరు సక్రమంగా రావడం లేదు. ప్రాజెక్టు పూర్తయితే వరద నీరు కరువై పంటలు చేతికందడం కష్టమవుతుంది.

– నాడిగేని వీరేష్, కోసిగి

ప్రాజెక్టు నిర్మాణం సరికాదు



వరద జలాల ఆధారంగానే కర్నూలు జిల్లాలోని ప్రాజెక్టులను నిర్మించారు. వరద జలాలను ఎక్కడికక్కడే నిలువరిస్తే దిగువ ప్రాజెక్టులకు అన్యాయం తప్పదు. కర్ణాటక ప్రభుత్వం అప్పర్ భద్ర డ్యాం నిర్మాణం విషయంలో పునరాలోచించాలి. ఇతర రాష్ట్రాల అభిప్రాయం తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం అనుమతులివ్వడం పక్షపాతమే.

– శ్రీనివాసరెడ్డి, ఎల్లెల్సీ మాజీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్

జగనన్నతోనే సుపరిపాలన

ఆదోని రూరల్ : జగనన్నతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మండిగిరిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంతం, బాలాజీ ఎస్టేట్, తిరుమలనగర్ కొట్టాల ప్రాంతాల్లో మా నమ్మకం నువ్వే జగన్... జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పాలన, పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అలాగే పథకాల తీరును, టీడీపీ పాలన, నేటి జగనన్న పాలనలోని తేడాలను వివరించారు. నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సురేష్, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రజల గుండెల్లో జగన్‌కు సుస్థిరస్థానం



దివ్యాంగుడికి సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: సంక్షేమ పాలనతో పేదల హృదయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరస్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి కొనియాడారు. బుధవారం మండలలోని కుంటనహాల్ గ్రామంలో మూడో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందజేయడంలో జగనన్న విజయవంతమయ్యారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు, నాయకులకు మంచి ఆత్మీయ స్వాగతం లభిస్తోందన్నారు. కుంటనహాల్ గ్రామంలో ఏడాదిలో రూ.10.43 కోట్లు వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు అందాయని తెలిపారు. గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లతో పాటు ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం చేపట్టడానికి ఇప్పటికే రూ. 1.77 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. జల జీవన్ మిషన్ కింద మండలానికి రూ.6.97 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు రూ.70 కోట్లతో ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. నీరు–చెట్టు కార్యక్రమంలో టీడీపీ నాయకులు దోచుకొని దాచుకున్నారని ఆరోపించారు. బదినేహాల్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేసి విద్యార్థుల ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని లక్ష్మి అనే మహిళ ఆయన దృష్టికి తీసుకురాగా.. ఇప్పటికే నిర్మాణం 90 శాతం పూర్తయ్యిందని, మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేసి కుంటనహాల్‌కు బస్సును పునరుద్ధిస్తామన్నారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు ప్రస్తావించడంతో.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు పార్వతమ్మ, గ్రామ ఇన్‌చార్జ్ శివరాం, మాజీ ఎంపీటీసీ బుస్సన్నగౌడ్, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుసుమ, నాయకులు నర్సిరెడ్డి, ఏకాంబరరెడ్డి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



ప్రకృతి వ్యవసాయంపై యాక్షన్ ప్లాన్ తయారీకి సామగ్రి అందజేస్తున్న డీపీఎం చంద్రశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరంలో జిల్లాలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమ తరహాలో చేపట్టాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మద్దూరునగర్‌లోని కార్యాలయంలో అన్ని కేటగిరీలకు చెందిన సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. అలాగే 2023–24 సంవత్సరం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కిచెన్ గార్డెన్, పెరటి తోటలు అభివృద్ధి చేయించాలన్నారు. ఏడాది పొడవున పంటలు ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. యాక్షన్‌ప్లాన్ తయారీకి అవసరమైన పత్రాలను సిబ్బందికి పంపిణీ చేశారు. కన్సల్టెంట్ లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్

చిప్పగిరి: మండలంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్ అధికారులతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు తీరు, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఎంఈఓ మస్తాన్ రావుతో కలిసి తనిఖీ చేశారు.

క్రికెట్ విజేత ఇంగళదహాళ్

హొళగుంద:కర్ణాటకలోని సిరుగుప్ప తాలూకా బంద్రాళు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో హొళగుంద మండలం ఇంగళదహాళ్‌కు చెందిన కేసీ తిమ్మారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బంద్రాలు, ఇంగళదహాళ్ కేసీటీఆర్ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ జరగగా కేసీటీఆర్ జట్టు విజయం సాధించింది. జట్టుకు నిర్వాహకులు రూ.15వేల నగదును బహుమతిగా అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువులో ఈ నెల 18న నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై బుధవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసులు గ్రామంలో విచారణ చేపట్టారు. పొలం సరిహద్దు విషయంలో ఎస్సీలు, బీసీ సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణ జరిగింది. ఎస్సీలపై దాడిచేసిన బీసీ వర్గానికి చెందిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. ఈ మేరకు పొలం వద్దకు డీఎస్పీ వెళ్లి విచారణ చేపట్టారు. ఈయన వెంట ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం

ఆలూరు: మాల కులస్తులు ఐక్య మత్యంతో ముందుకు సాగుదామని జిల్లా మాల సంఘం అధ్యక్షుడు మహానంది పిలుపుఇచ్చారు. ఆలూరులో వాసవీకల్యాణ మండపంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన మాలకులస్తులతో ఆయన సమావేశమైయ్యారు. మహనంది మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని చిన్నారులను చదివించుకోవడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో వీరేష్, నాగరాజ్, వెంటేష్, రామాంజనేయులు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ఇంటర్‌బోర్డ్ అనుమతి, గుర్తింపు లేకుండా పట్టణంలో ప్రారంభించిన జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎజాజ్‌అహమ్మద్‌కు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనంత్‌కుమార్, విజయ్, వికాస్, విష్ణు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి నేడు ఆఖరు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 20వ తేదీ ఆఖరు అని పాఠశాల ఎస్ఓ విద్యావతి బుధవారం తెలిపారు. కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ మాత్రమే)లో 40 సీట్లు ఉన్నాయన్నారు. అనాథ పిల్లలు, బడి బయట, బడిమానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలోని పేద బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అప్రమత్తంగా ఉండండి

ఎమ్మిగనూరుటౌన్: ఆసుపత్రుల్లో సిబ్బంది అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ఫైర్‌ఆఫీసర్ రామాంజినేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శ్రీశక్తి నర్సింగ్‌హోం ఆవరణలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపులోకి తెచ్చే విధానాలను డెమో ద్వారా వివరించారు.

శ్రీమఠానికి కేజీ వెండి విరాళం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటక రాష్ట్రం కొప్పల్ జిల్లాలోని హుల్గికి చెందిన నాగరాజు అనే భక్తుడు బుధవారం కేజీ వెండి విరాళంగా అందజేశాడని శ్రీ మఠం అధికారులు తెలిపారు. ఆయన ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనకు మఠం అధికారులు స్వామి వారి ప్రసాదం, మెమెంటో, శేషవస్త్రం అందజేశారు.

రేపటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామ సచివాలయ పరిధిలోని కామన్‌దొడ్డి, కందుకూరు, కడదొడ్డి గ్రామాల్లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరు, సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

తండ్రిపై కుమారుడి దాడి

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో భూ తగాదా విషయంలో తండ్రిపై కుమారుడు దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేకల ముత్తన్నకు ఇద్దరు భార్యలు, 9 ఎకరాల సాగు భూమి ఉంది. మొదటి భార్య గోవిందమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు శివలింగ ఉండగా.. రెండో భార్య ఈరమ్మకు కుమార్తె, కుమారుడు లింగప్ప సంతానం. భూ తగాదా విషయంలో మొదటి భార్య కుమారుడు శివలింగ దాడి చేసి గాయపరిచాడు. దీంతో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలించారు. లింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

విజయవంతం చేయండి

పెద్దకడబూరు: ఈ నెల 24న కర్నూల్‌లో జరిగే రాయలసీమ కర్తవ్యదీక్షను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఖాజా, నల్లారెడ్డి, కృష్ణా కోరారు. బుధవారం స్థానిక సొసైటీ ఆవరణలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను రైతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాలయసీమ నీళ్లు, నిధులు, నియమాల కోసం పోరాడుతున్నామన్నారు. కర్ణాటకలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల తుంగభద్రపై ఆధారపడిన రాయలసీమ జిల్లాలు పూర్తిగా ఎడారిగా మారే అవకాశం ఉందని, ఎల్లెల్సీ, హెచ్ఎల్సీ, ఆర్డీఎస్ కింద ఉన్న రాయలసీమ ఆయకట్టు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈరన్న, రామాంజనేయులు, బసప్ప, రాములమ్మ. రంగన్న పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



జేసీబీతో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక భూగేని చెరువు నుంచి నాడుగేని వీధి హనుమాన్ తాత గుడి వరకు ప్రధాన డ్రైనేజీ పూడి పోవడంతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులతో పూడిక తొలగింపు బుధవారం ప్రారంభించారు. గతంలో చింతలగేని మారెమ్మ దేవి కాలనీ నుంచి వివిధ కాలనీల మురుగు నీరు ప్రధాన కాల్వ ద్వారా భూగేని చెరువు వరకు వెళ్లేవి. ప్రస్తుతం భూగేని చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు చేస్తున్నారు. దీంతో పై ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీటిని మళ్లించేందుకు దాదాపు 3 కి.మీ. మేర ప్రధాన కాల్వకు మరమ్మతు పనులు చేపట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



అటవీశాఖ కార్యాలయంలో ట్రాక్టర్లు

కోసిగి: కౌతాళం మండల పరిధిలో తిప్పలదొడ్డి ఫారెస్ట్ ఏరియాలో అక్రమంగా రెండు ట్రాక్టర్లలో మంగళవారం రాత్రి ఇసుక తరలిస్తుండగా దాడి చేసి సాధీనం చేసుకున్నట్లు ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, బీట్ ఆఫీసర్ అనురాధ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్, కోసిగికు చెందిన మరో ట్రాక్టర్లతో రాత్రి అటవీ ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను ఆదోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఉంచామన్నారు.

దేశాన్ని కాపాడుదాం



నిరసన తెలుపుతున్న వామ పక్షపార్టీ నాయకులు

కౌతాళం: బీజేపీ మతోన్మాద, నిరంకుశ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చాయి. బుధవారం మండల కేంద్రంలో ప్రచారభేరి కార్యక్రమం ప్రారంభించి, గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు మల్లయ్య, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వీరేష్, సీపీఐ కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి, ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అనుకూలురైన కార్పొరేటర్లకు అప్పగిస్తోందని వివరించారు. ఇలాంటి చర్యలతో సామాన్యులు జీవనం ఇబ్బందికరంగా మారందన్నారు. ప్రజలు కేంద్రం తీరును గమనించి వారిని నిలదీయాలని కోరారు.

24 నుంచి ఎల్లార్తిలో క్రికెట్ టోర్నీ

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో ఈ నెల 24 నుంచి అర్జున్ యువసేన ఆధ్వర్యంలో ఎస్ఎస్‌వీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు వాల్మీకి అర్జున్, దోర్నాల షేక్షావలి తదితరులు బుధవారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ. 10 వేలు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 23వ తేదీ లోపల ఎంట్రీ ఫీజు రూ.1,100 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440176986, 6304464939 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగన్న (59) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. నాగన్న పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా వ్యవసాయ బోరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నరసమ్మ, కుమారుడు హనుమంతు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.